ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



హైకోర్టు 34వ సీజేగా కేఆర్ శ్రీరామ్ ప్రమాణం

● వెంటనే బాధ్యతల స్వీకారం



సీజేకు నియామక ఉత్తర్వులు అందజేస్తున్న గవర్నర్ ఆర్ఎన్ రవి

చెన్నై, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మద్రాసు హైకోర్టు 34వ ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ కల్పాతి రాజేంద్రన్ శ్రీరామ్ శుక్రవారం ప్రమాణ స్వీకారం చేశారు. గిండిలోని రాజ్‌భవన్‌లో జరిగిన కార్యక్రమంలో జస్టిస్ కేఆర్ శ్రీరామ్‌తో గవర్నర్ ఆర్ఎన్ రవి ప్రమాణం చేయించారు. గతంలో మద్రాసు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా వ్యవహరించిన ఎస్వీ గంగాపూర్‌వాలా పదవీ విరమణ అనంతరం న్యాయమూర్తి ఆర్.మహాదేవన్ తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా వ్యవహరించారు. ఆయన సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా నియమితులైన తర్వాత, సీనియర్ న్యాయమూర్తి కృష్ణకుమార్ తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా వ్యవహరిస్తున్నారు. ఈ నేపథ్యంలో, ముంబై హైకోర్టు సీనియర్ న్యాయమూర్తి కేఆర్ శ్రీరామ్‌ను మద్రాసు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా నియమిస్తూ రాష్ట్రపతి ద్రౌపతిముర్ము ఈ నెల 21న ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నేపథ్యంలో గిండి రాజ్‌భవన్‌లో శుక్రవారం మద్రాసు హైకోర్టు న్యాయమూర్తిగా కేఆర్ శ్రీరామ్ చేత గవర్నర్ ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమంలో మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ ఇందిరా బెనర్జీ, శాసనసభ స్పీకర్ అప్పావు, మంత్రులు దురైమురుగన్, కేఎన్ నెహ్రూ, పొన్ముడి, రఘుపతి, మాజీ ముఖ్యమంత్రి ఒ.పన్నీర్‌సెల్వం, మాజీ మంత్రి డి.జయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

500 తిరుక్కురళ్ కంఠస్థం: సీజే శ్రీరామ్

500 తిరుక్కురళ్‌ను కంఠస్థం చేసినట్లు మద్రాసు హైకోర్టు నూతన సీజేగా బాధ్యతలు చేపట్టిన కేఆర్ శ్రీరామ్ తెలిపారు. ప్రమాణస్వీకారం అనంతరం బాధ్యతలు చేపట్టేందుకు మొట్టమొదటగా హైకోర్టుకు వచ్చిన జస్టిస్ శ్రీరామ్‌కు న్యాయమూర్తులు, ఉన్నతాధికారులు, న్యాయవాదులు ఘనస్వాగతం పలికారు. కొత్త సీజేకు స్వాగతం పలికిన అడ్వకేట్ జనరల్ పీఎస్ రామన్ మాట్లాడుతూ... 1981లో తమిళ భాష తెలిసిన ఎంఎం ఇస్మాయిల్ ప్రధాన న్యాయమూర్తిగా వ్యవహరించారని, 43 ఏళ్ల అనంతరం మళ్లీ తమిళ భాష తెలిసిన కేఆర్ శ్రీరామ్ ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టడం గర్వంగా ఉందన్నారు. తమిళనాడు, పుదుచ్చేరి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అమల్‌రాజ్, పలు న్యాయవాదుల సంఘాలు కొత్త సీజేకు ఆహ్వానం పలికారు. అనంతరం తమిళంలో ప్రసంగం ప్రారంభించిన కేఆర్ శ్రీరామ్.. "తమిళ తాయికి తొలి వందనం. సహోదరి, సహోదరులకు మనఃపూర్వక శుభాకాంక్షలు" అన్నారు. తాను పాఠశాలలోనే తమిళం చదివానని, 500 తిరుక్కురల్ కంఠస్థం చేశానన్నారు. తమిళుల సంస్కృతి, సంప్రదాయాలు, మద్రాసు హైకోర్టు పారంపర్యం సంరక్షించే బాధ్యత అందరిపై ఉందన్నారు. హైకోర్టు సంప్రదాయాన్ని తప్పకుండా కాపాడతానని ఆయన పేర్కొన్నారు. న్యాయ సంబంధిత అంశాలు సాఫీగా జరిగేలా అందరూ తనకు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.



జస్టిస్ కేఆర్ శ్రీరాం చేత ప్రమాణం చేయిస్తున్న గవర్నర్

హైకోర్టుకు మరో న్యాయమూర్తి

అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ షమీమ్ అహ్మద్ మద్రాస్ హైకోర్టుకు బదిలీ అయ్యారు. ఆయన ఈ నెల 30వ తేదీ ఉదయం 10.15 గంటలకు హైకోర్టులో ప్రమాణం చేయనున్నారు. ఆయన చేత హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ కేఆర్ శ్రీరామ్ ప్రమాణం చేయించనున్నారు.



ఢిల్లీలో ప్రధాని నరేంద్రమోదీకి వినతిపత్రం సమర్పిస్తున్న ముఖ్యమంత్రి స్టాలిన్

ప్రధానితో భేటీ సంతృప్తికరం

● ముఖ్యమైన 3 డిమాండ్లపై చర్యలు కోరాం

● ద్విభాషా విధానానికే కట్టుబడి ఉన్నాం

● ఢిల్లీలో స్టాలిన్

చెన్నై, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్రమోదీతో జరిగిన సమావేశం సంతృప్తికరంగా, ఆహ్లాదకరమైన వాతావరణంలో కొనసాగిందని, నిర్ణీత సమయకంటే ఎక్కువ సేపు తామిద్దరం మాట్లాడుకున్నామని ముఖ్యమంత్రి స్టాలిన్ తెలిపారు. ఈ పరిస్థితుల్లో రాష్ట్రానికి సంబంధించి ముఖ్యమైన మూడు సమస్యలను ఆయన పరిష్కరిస్తారని ఆశిస్తున్నట్లు సీఎం వ్యాఖ్యానించారు. గురువారం ఢిల్లీకి బయలుదేరి వెళ్లిన సీఎం తమిళనాడు హౌస్‌లో రాత్రి బసచేశారు. శుక్రవారం ఉదయం ఆయన ప్రధాని నరేంద్ర మోదీని ఆయన నివాసగృహంలో కలుసుకున్నారు. పావుగంట సేపు జరగాల్సిన వీరి సమావేశం ముప్పావు గంట సేపు కొనసాగింది. ప్రధానికి వినతి పత్రం సమర్పించిన తర్వాత తమిళనాడు హౌస్‌కు చేరుకున్న స్టాలిన్ మీడియాతో మాట్లాడుతూ... చెన్నైలో మొదటి విడత మెట్రోరైలు ప్రాజెక్టుకు కేటాయించినట్లే, రెండో విడత మెట్రోరైలు ప్రాజెక్టును కూడా కేంద్రప్రభుత్వం 50 శాతం నిధులు కేటాయించాలని కోరుతున్నామని, కొత్త ప్రాజెక్టుకు తప్పకుండా నిధులు కేటాయిస్తామని 2021-22 బడ్జెట్‌లో ఆర్థిక మంత్రి ప్రకటించారని గుర్తు చేశారు. మెట్రో ప్రాజెక్టు పనులకు ఇప్పటివరకూ రూ.18,564 కోట్లకు పైగా ఖర్చు చేశామని, అయితే కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలుపకపోవంతో కేంద్రం నుంచి యాభై శాతం నిధులు పొందలేని పరిస్థితి ఏర్పడిందన్నారు.

రాష్ట్రంలో ద్విభాషావిధానమే...

కేంద్ర ప్రభుత్వం 60 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం నిధులతో ఉమ్మడిగా అమలు చేయాల్సిన విద్యావిధానం పథకం కింద ఈ ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రానికి కేటాయించాల్సిన రూ.2152 కోట్లలో మొదటి విడత నిధులు ఇంకా విడుదల చేయలేదని, ఈ విషయాన్ని కూడా ప్రధాని దృష్టికి తీసుకెళ్ళినట్లు చెప్పారు. ఈ పథకంకింద అవగాహన ఒప్పందంలో రాష్ట్ర ప్రభుత్వం సంతకం చేయకపోవడం వల్లే నిధులు విడుదలవలేదని కేంద్రప్రభుత్వం ప్రకటించడం గర్హనీయమన్నారు. జాతీయ విద్యావిధానంలో కొన్ని మంచి అంశాలు కూడా ఉన్నాయని, వాటిలో చాలా వాటిని రాష్ట్ర ప్రభుత్వం ఎప్పటి నుండో అమలు చేస్తోందన్నారు. అయితే జాతీయ విద్యా కమిటీ పేర్కొన్న నిబంధనల్లో ఒకటైన త్రిభాషా విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఎప్పటికీ అంగీకరించదని, ద్విభాషా విధానానికే కట్టుబడి ఉన్నామని, ఏ రాష్ట్రంపైనా ఏ భాషను నిర్బంధంగా అమలు చేసే ప్రసక్తే లేదంటూ కేంద్రం ఇచ్చిన భరోసా అవగాహన ఒప్పందంలో లేదని, కనుకనే ఒప్పందంలో మార్పులు చేయాలని కోరుతున్నామన్నారు. కేంద్రం నిధులు విడుదల చేయకపోవడంతో టీచర్లకు జీతాలు ఇవ్వలేకపోతున్నామనే విషయాన్ని కూడా ప్రధాని దృష్టికి తీసుకెళ్ళామని చెప్పారు. ఇక మూడోది తమిళ జాలర్ల సమస్య అని, దీనిని పలుమార్లు ప్రధాని, విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లానని తెలిపారు. తమిళ జాలర్లపై శ్రీలంక నావికాదళం దాడులను నిరోధించాలని, తమిళ జాలర్లు స్వేచ్ఛగా చేపలు పట్టుకునే పరిస్థితి కల్పించాలని ప్రధానికి విజ్ఞప్తి చేశామన్నారు. శ్రీలంక నావికాదళం నిర్బంధంలో ఉన్న జాలర్లను వీలయినంత త్వరగా విడుదల చేయాలని డిమాండ్ చేశామని చెప్పారు. వచ్చేనెల కొలంబోలో జరుగనున్న భారత్, శ్రీలంక దేశాల మధ్య జరుగనున్న ఉమ్మడి కమిటీ సమావేశంలో ఈ అంశంపై చర్చించి తక్షణ చర్యలు చేపట్టాలని ప్రధానిని కోరినట్లు స్టాలిన్ చెప్పారు. ప్రధానమైన ఈ మూడు కీలకమైన అంశాలను విన్న ప్రధాని తక్షణ చర్యలు చేపడతామంటూ హామీ ఇచ్చారని స్టాలిన్ తెలిపారు. ఢిల్లీ పర్యటన సాఫీగా జరిగిందని, సోనియాగాంధీని మర్యాదపూర్వకంగా కలుసుకున్నానని ఆయన చెప్పారు.

తమిళనాడు హౌస్‌లో సీఎం స్టాలిన్‌ను కలుసుకున్న సీపీఐ జాతీయ కార్యదర్శి డి. రాజా



జాతీయ నేతలతో వరుస భేటీలు

● ఢిల్లీలో రోజంతా బిజీబిజీగా సీఎం



ఏఐసీసీ పార్లమెంటరీకమిటీ అధ్యక్షురాలు సోనియాగాంధీకి శాలువ అందిస్తున్న స్టాలిన్

చెన్నై, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ శుక్రవారం ఢిల్లీలో బిజీబిజీగా గడిపారు. ప్రధాని మోదీతోపాటు జాతీయపార్టీల నాయకులను కూడా కలుసుకున్నారు. శుక్రవారం ఉదయం తమిళనాడు హౌస్‌లో సీపీఐ జాతీయ కమిటీ ప్రధాన కార్యదర్శి డి.రాజాతో సమావేశమయ్యారు. ఆ సందర్భంగా జాతీయ రాజకీయ పరిస్థితులు, రాష్ట్రస్థాయి రాజకీయపరిస్థితులపై ఇరువురూ చర్చించుకున్నారు. ఆ తర్వాత తమిళనాడు హౌస్ నుంచి బయలుదేరి ఉదయం 11 గంటలకు ప్రధాని నరేంద్రమోదీ నివాసానికి వెళ్ళారు. స్టాలిన్‌ను మోదీ సాదరంగా ఆహ్వానించి లోపలకు తోడ్కొని వెళ్ళారు. ప్రధాని మోదీని సత్కరించిన తర్వాత ఆయన 'తడమ్' పేరుతో పిలిచే తమిళ సంస్కృతిని చాటేలా తిరునల్వేలిలో అరటినారతో తయారైన బుట్ట, తాటాకులతో తయారైన పెట్టెను కానుకగా అందజేశారు. ప్రధానితో సమావేశం అనంతరం ఏఐసీసీ మాజీ అధ్యక్షురాలు, కాంగ్రెస్ పార్లమెంటరీ కమిటీ అధ్యక్షురాలు సోనియాగాంధీని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. స్టాలిన్‌తోపాటు ఎంపీలు టీఆర్ బాలు, కనిమొళి కూడా వెళ్లారు. అదేవిధంగా ఇటీవల మృతి చెందిన సీపీఎం జాతీయ కమిటీ ప్రధాన కార్యదర్శి సీతారామ్ ఏచూరి నివాసానికి వెళ్లి ఏచూరి చిత్రపటానికి నివాళులర్పించారు. ఏచూరి సతీమణి సీమాను, కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఎంపీలు టీఆర్‌బాలు, తిరుచ్చి శివా, కనిమొళి పాల్గొన్నారు. ఇలా శుక్రవారం ఉదయం నుండి సాయంత్రం వరకూ ఢిల్లీలో స్టాలిన్ బిజీగా గడిపి, చెన్నై తిరిగి బయలుదేరారు.



ఢిల్లీలో సీతారాం ఏచూరి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ముఖ్యమంత్రి

ప్రగతిశీల దేశం యువతతోనే సాధ్యం

విద్యార్థిని పరిపూర్ణ వ్యక్తిగా తీర్చిదిద్దేది ఉపాధ్యాయుడే ● మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్

అడయార్, సెప్టెంబరు 27: అభ్యుదయ భావాలు కలిగిన యువత మాత్రమే ప్రగతిశీల దేశాన్ని నిర్మించగలరని మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ పేర్కొన్నారు. నగరంలోని అగర్వాల్ రిలీఫ్ అండ్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ (ఏఈఆర్‌టీ) గోల్డెన్ జూబ్లీ వేడుకలు శుక్రవారం జరిగాయి. ఈ కార్యక్రమానికి రామ్‌నాథ్ కోవింద్ ముఖ్య అతిథిగా హాజరుకాగా, గౌవర అతిథిగా 'తుగ్లక్' పత్రిక సంపాదకులు ఎస్.గురుమూర్తి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ రాష్ట్రపతి ప్రసంగిస్తూ... ఒక వ్యక్తి మరో వ్యక్తికి ఇచ్చే ఏకైక గొప్ప సంపద విద్య మాత్రమేనన్నారు. తాను స్వగ్రామంలో ప్రాథమిక విద్యవరకు మాత్రమే అభ్యసించానని, ఆ తర్వాత ఆరు కిలోమీటర్ల దూరం ప్రయాణించి పైచదువులు చదువుకున్నానని గుర్తు చేసుకున్నారు. తాను ఈ రోజు ఈ స్థితిలో ఉన్నానంటే దానికి కారణం విద్య మాత్రమేనన్నారు. దేశంలో 24 శాతం మంది 14 యేళ్ళలోపు, 50 శాతం మంది 25 యేళ్ళలోపు వారేనని, దేశ భవిష్యత్ వీరి చేతుల్లోనే ఉందన్నారు. బోధనతో పాటు భవిష్యత్ ఆలోచనలపై మక్కువ కలిగేలా ఉపాధ్యాయులు విద్యార్థుల్లో కొత్త దృక్పథం అలవడేలా చేయాలన్నారు. బోధనలో ఆధునిక విద్యా వ్యవస్థ, డిజిటల్ విధానం ద్వారా ఉపాధ్యాయులు విద్యార్థుల ప్రతిభను మెరుగుపరిచేలా కృషి చేయాలన్నారు. మంచి వ్యక్తిత్వం కలిగిన విద్యార్థి మాత్రమే మంచి తండ్రి, తల్లి, స్నేహితుడు, వ్యాపారవేత్త కాగలరన్నారు. ప్రస్తుతం ప్రపంచ దేశాల అవసరాలను తీర్చగల స్థితిలో మన దేశం ఉందన్నారు. అందువల్ల విద్యార్థులు తమకు ఏది కావాలో... ఏది వద్దో వారే నిర్ణయించుకుని తమ భవిష్యత్‌కు బంగారుబాటలు వేసుకోవాలని పిలుపునిచ్చారు. అభివృద్ధి చెందిన భారతదేశాన్ని నిర్మించాల్సిన బాధ్యత నేటి విద్యార్థులపై ఉందని, ఈ విషయంలో విద్యార్థులు ప్రధాన పాత్ర పోషిస్తారని తాను బలంగా విశ్వసిస్తున్నానని పేర్కొంటూ విద్యార్థులకు రామ్‌నాథ్ కోవింద్ శుభాకాంక్షలు తెలిపారు. ఏఆర్‌ఈటీ మేనేజింగ్ ట్రస్టీ మురళీలాల్ సొంతాలియా, ఏఆర్‌ఈటీ నిర్వాహకులు, ట్రస్ట్ ఆధ్వర్యంలోని పాఠశాలలకు చెందిన విద్యార్థులు, ఉపాధ్యాయులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



వేడుకల్లో రామ్‌నాథ్ కోవింద్

మలుపులో అదుపుతప్పి మినీ బస్సు బోల్తా

● ముగ్గురు విద్యార్థులు సహా నలుగురి మృతి



మృతులు నితీష్ కుమార్, సతీష్‌కుమార్, మాధస్వామి, వాసురాజ్ (ఫైల్ ఫోటో)



బోల్తాపడిన మినీ బస్సు

పెరంబూర్, సెప్టెంబరు 27: విరుదునగర్ జిల్లా శ్రీవిల్లిపుత్తూర్ సమీపంలోని మాంసాపురంలో మినీ బస్సు బోల్తాపడిన ఘటనలో ఒకే గ్రామానికి చెందిన ముగ్గురు విద్యార్థులు సహా నలుగురు మృతిచెందారు. మంసాపురం నుంచి శుక్రవారం ఉదయం 8.20 గంటల ప్రాంతంలో ఓ మినీ బస్సు సుమారు 40 మంది విద్యార్థులతో శ్రీవిల్లిపుత్తూర్ బయల్దేరింది. శ్రీవిల్లిపుత్తూర్-మాంసాపురం రోడ్డులో ని పీహెచ్‌సీ సమీపంలో మలుపు తిరుగుతుండగా హఠాత్తుగా అదుపుతప్పి రోడ్డు పక్కన బోల్తాపడింది. ఈ ఘటనలో ప్లస్ టూ విద్యార్థి మాంసాపురం గాంధీనగర్‌కు చెందిన నితీష్‌కుమార్ (17), శ్రీవిల్లిపుత్తూర్ ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో బీఏ రెండో సంవత్సరం చదువుతున్న సతీష్‌కుమార్ (20), 10వ తరగతి చదువుతున్న వాసురాజ్ (15), ప్రైవేటు సంస్థ ఉద్యోగి మాడస్వామి (28) సంఘటనా స్థలంలోనే మృతిచెందారు. సమాచారం అందుకున్న అందుకున్న శ్రీవిల్లిపుత్తూర్ అగ్నిమాపక సిబ్బంది, స్థానికులతో కలసి బస్సు శిధిలాల నుంచి గాయపడిన వారిని వెలికితీసి శ్రీవిల్లిపుత్తూర్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై శ్రీవిల్లిపుత్తూర్ పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

సీఎం దిగ్భ్రాంతి...

శ్రీవిల్లిపుత్తూర్‌లో మినీ బస్సు బోల్తాపడి నలుగురు మృతిచెందడంపై ముఖ్యమంత్రి స్టాలిన్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ మేరకు సచివాలయం విడుదల చేసిన ప్రకటనలో.. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలపడంతో పాటు వారికి తలా రూ.2 లక్షలు ఆర్థిక సాయం, గాయపడిన వారికి మెరుగైన చికిత్స అందించాలని సీఎం ఆదేశించినట్లు ప్రభుత్వం తెలిపింది.

కాలుష్య రహిత చెన్నై

● బహిరంగ ప్రదేశాల్లో చెత్త కాలిస్తే రూ.5 వేల జరిమానా

● కౌన్సిల్ సమావేశంలో తీర్మానం

ప్యారీస్, సెప్టెంబరు 27: నగరంలో కాలుష్య నివారణకు జీసీసీ చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా బహిరంగ ప్రదేశాల్లో చెత్త కాలిస్తే రూ.5 వేలు జరిమానా విధించాలని గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ నిర్ణయించింది. జీసీసీ ప్రధాన కార్యాలయమైన రిప్పన్ భవనంలో శుక్రవారం మేయర్ ప్రియ అధ్యక్షతన జరిగిన కౌన్సిల్ సమావేశంలో పలు కీలక తీర్మానాలు ఏకగ్రీవంగా ఆమోదించారు. రాజధాని నగరం చెన్నైను సుందరీకరణంగా చెత్తరహిత నగరంగా తీర్చిదిద్దే పథకంలో భాగంగా బహిరంగ ప్రదేశాల్లో చెత్త కాలిస్తే ఇప్పటివరకు ఉన్న జరిమానా రూ.1,000 నుంచి రూ.5,000లకు పెంచారు. అదే విధంగా, భవన నిర్మాణ వ్యర్థాలు, చెట్టు కొమ్మలు వీధుల్లో వేస్తే గతంలో వసూలుచేసిన జరిమానా రూ.200 నుంచి రూ.2,000లకు పెంచారు. లాడ్జీలు, టీ దుకాణాలు, హోటళ్లు, క్యాంటీన్లు, మేన్షన్లు నడిపే వారు తప్పనిసరిగా చెత్త బుట్టలను ఏర్పాటుచేసుకోవాలని, లేని పక్షంలో రూ.1,000 జరిమానా చెల్లించాల్సి ఉంటుందని జీసీసీ హెచ్చరించింది. మెరీనా బీచ్, ఎలియట్స్ బీచ్, అన్నానగర్, ఎగ్మూర్ రాజరత్నం స్టేడియం, కలెక్టర్ కార్యాలయం తదితర ప్రధాన ప్రాంతాల్లో కార్యక్రమాలు నిర్వహించే వారు కార్యక్రమం ముగిసిన తర్వాత ఆ ప్రాంతాలను శుభ్రం చేయాలని, లేని పక్షంలో రూ.5,000 జరిమానా చెల్లించాల్సి ఉంటుందని జీసీసీ తెలిపింది. నగరంలోని 200 వార్డుల్లో ఉన్న వీధుల్లో పేరుకుపోయే చెత్తను ఎప్పటికప్పుడు పారిశుధ్య సిబ్బంది తొలగించాలని, కార్పొరేషన్ పాఠశాలల్లో సెక్యూరిటీ సిబ్బందిని ప్రధానోపాధ్యాయులే నియమించుకోవాలని సమావేశంలో నిర్ణయించారు.. ఇదిలా ఉండగా, ఈ సమావేశంలో వర్షాకాలం ప్రారంభమవుతున్న నేపథ్యంలో, ప్రజాపనుల శాఖ, జలవనరుల శాఖల ద్వారా డ్రైనేజీ కాలువల్లో పూడికతీత పనులు వేగవంతం చేయాలని కార్పొరేటర్ కన్నన్ డిమాండ్ చేశారు. కాగా, ఆస్తి పన్ను ఏడాదికి 6 శాతం పెంచుకొనే తీర్మానాన్ని వెనక్కి తీసుకోవాలంటూ కాంగ్రెస్ సభ్యుడు శివరాజశేఖర్ డిమాండ్ చేశారు. ఆయన మాట్లాడుతూ... ముంబై, కోల్‌కతా, బెంగళూరు కార్పొరేషన్‌లలో ఉన్నలాగే జీసీసీ స్టాండింగ్ కమిటీ ఛైర్మన్ల పదవిని రొటేషన్ పద్ధతిలో కేటాయించాలని కోరారు. ఈ సమావేశంలో డిప్యూటీ మేయర్ మహేష్‌కుమార్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



జీసీసీ సమావేశంలో మేయర్ ప్రియ, డిప్యూటీ మేయర్ మహేష్ కుమార్

సమాచార దృశ్యిని

2న తిరుమల గొడుగుల ఊరేగింపు

ఐసిఎఫ్, సెప్టెంబరు 27: నగరంలో తిరుమల తిరుపతి గొడుగుల ఊరేగింపు అక్టోబరు 2న జరుగనుందని నిర్వాహకులు తెలిపారు.తిరుమలలో పురటాసి మాసంలో జరిగే బ్రహ్మోత్సవాలకు రాష్ట్ర భక్తుల ఆధ్వర్యంలో గొడుగులను కానుకగా సమర్పించడం ఆనవాయితీ. ఈ గొడుగులను ప్రతి ఏటా ఊరేగింపుగా తీసుకెళ్లి అందజేస్తుంటారు.ఆప్రకారం బ్రాడ్‌వే సమీపంలోని చెన్నకేశవ పెరుమాళ్ ఆలయం నుంచి 2వ తేది ఉదయం 10 గంటలకు ప్రత్యేక పూజల అనంతరం ఊరేగింపు బయల్దేరనుంది. 7వ తేది టీటీడీ అధికారులకు వీటిని అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

నేటినుంచి పోలీసులకు యోగా శిక్షణ

ఐసిఎఫ్, సెప్టెంబరు 27: మానసిక ఒత్తిడి అధికమించేలా పోలీసులకు శనివారం నుంచియోగా శిక్షణ ఇవ్వనున్నారు. చెన్నై పోలీస్ కమిషనర్ కార్యాలయం ఆధ్వర్యంలో 55 ట్రాఫిక్ పోలీస్ స్టేషన్లున్నాయి. వీటిలో పనిచేసే పోలీసులకు వారానికి మూడు రోజులు అంటే శుక్ర, శని, ఆదివారాల్లో యోగాలో శిక్షణ ఇవ్వనున్నారు. ఒక్కో జిల్లా నుంచి 50 మంది చొప్పున ఈస్ట్, నార్త్, సౌత్ పోలీస్ జిల్లాల నుంచి 150 మందికి మూడు రోజులు శిక్షణ ఇవ్వనున్నట్టు అధికారులు తెలిపారు.

ఊటీలో పుష్ప ప్రదర్శన ప్రారంభం

పెరంబూర్, సెప్టెంబరు 27: ప్రముఖ పర్యాటక కేంద్రం ఊటీలో రెండో సీజన్ పురస్కరించుకొని ప్రభుత్వ బొటానికల్ గార్డన్‌లో పూల ప్రదర్శన ప్రారంభమైంది. రెండో సీజన్ ప్రారంభం కావడంతో ఊటీకి వచ్చే పర్యాటకుల సంఖ్య పెరిగింది. బొటానికల్ గార్డన్ లోని అలంకార వేదికలపై 10వేల కుండీల్లో 70 రకాల పూలు ప్రదర్శనకు ఉంచారు. నెల రోజుల పాటు జరుగనున్న ఈ పుష్ప ప్రదర్శనను సుమారు 2 లక్షల మంది తిలకించే అవకాశముందని అధికారులు తెలిపారు. కాగా, ఇప్పటికే బొటానికల్ గార్డన్‌లో 4.5 లక్షల పూలమొక్కలతో కనువిందు చేస్తున్న విషయం తెలిసిందే.

డిసెంబరులో గ్రూప్-2,2ఏ ఫలితాలు

ఐసిఎఫ్, సెప్టెంబరు 27: గ్రూప్-2, 2ఏ ప్రిలిమినరీ ఫలితాలు డిసెంబరులో విడుదల కానున్నాయని టీఎన్‌పీఎస్సీ తెలిపింది. రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులను రాతపరీక్ష ద్వారా టీఎన్‌పీఎస్సీ భర్తీ చేస్తోంది. ఈ క్రమంలో వివిధ పోస్టుల భర్తీకి ఇటీవల రాతపరీక్ష జరిగింది. ఆ పరీక్షా ఫలితాలు డిసెంబరులో విడుదల చేయనున్నట్లు టీఎన్‌పీఎస్సీ తెలిపింది.

మరుదుమలైకి ఈ-పాస్ తప్పనిసరి

పెరంబూర్, సెప్టెంబరు 27: కోయంబత్తూర్ మరుదుమలై ఆలయానికి వెళ్లే వాహనాలకు ఈ-పాస్ తప్పనిసరి చేశారు. ఈ విషయమై ఆలయ కార్యాలయానికి తపాలా, వెబ్‌సైట్ ద్వారా భక్తులు తమ అభిప్రాయాలు తెలియజేయాలని ఆలయ జాయింట్ కమిషనర్ ప్రకటన విడుదల చేశారు.

రెట్టేరిలో పర్యావరణ పార్క్

ఐసిఎఫ్, సెప్టెంబరు 27: స్థానిక మాధవరం సమీపంలోని రెట్టేరిలో పర్యావరణ పార్క్ ఏర్పాటుకానుంది. రెట్టేరి జలాశయానికి 0.32 టీఎంసీల సామర్థ్యం ఉంది. ఇందులో భాగంగా రూ.43 కోట్లతో పర్యావరణ పార్క్ ఏర్పాటుచేయనున్నారు. ఈ నిధులతో పూడిక తీసి, గట్లు పటిష్టపరిచి కంచె వేయనున్నారు. అలాగే, 4 కృత్రిమ దీవులు జలాశయంలో ఏర్పాటుచేయనున్నారు. ప్రస్తుతం 12,100 మొక్కలు నాటే కార్యక్రమం జరుగుతోంది.

పెరిగిన టెంకాయల ధరలు

ఐసిఎఫ్, సెప్టెంబరు 27: దిగుమతులు తగ్గడంతో టెంకాయల ధర పెరిగింది. కోయంబేడు మార్కెట్లో గత వారం ఒక టెంకాయ రూ.30 నుంచి రూ.33 ధర పలుకగా, ప్రస్తుతం రూ.50 పెరిగింది. ఈ విషయమై వ్యాపారులు మాట్లాడుతూ... మార్కెట్లో అన్ని కూరగాయల ధరలు కనీసంగా పెరిగాయని, అదే విధంగా దిగుమతులు తగ్గిన కారణంగా టెంకాయ ధరలు కూడా పెరిగాయని, చిల్లర విక్రయంలో ఒక టెంకాయ రూ.50 నుంచి రూ.60 వరకు విక్రయమవుతోందని తెలిపారు.

ఆవిన్ నుంచి ప్రొటీన్ పెరుగు

పెరంబూర్, సెప్టెంబరు 27: అధిక ప్రోటీన్లు కలిగిన పెరుగు ప్యాకెట్లను పరిచయం చేయాలని ఆవిన్ సంస్థ నిర్ణయించింది. రాష్ట్రంలో పాలు, పెరుగు సహా సుమారు 200 రకాల పాల ఉత్పత్తులు విక్రయిస్తోంది. ఈ నేపథ్యంలో, ఆవిన్ మేనేజింగ్ డైరెక్టర్ వినీత్ మాట్లాడుతూ... ప్రజల ఆరోగ్యం దృష్టిలో ఉంచుకొని, మూలికలతో కూడిన పాలు, సుక్కుమల్లి కాఫీ, అశ్వగంధ పాలు తదితరాలు అందించనున్నామన్నారు. అలాగే, అధిక ప్రోటీన్లతో కూడిన పెరుగు ప్యాకెట్లు పరిచయం చేయాలని నిర్ణయించామని తెలిపారు. ప్రస్తుతం 200 మి.మీ రూ.18, 500 మి.లీ రూ.35 ధరకు పెరుగు ప్యాకెట్లు విక్రయిస్తున్నామన్నారు. త్వరలో అధిక ప్రోటీన్లు కలిగిన పెరుగు 120 మి.లీ, 250 మి.లీ, 450 మి.లీ ప్యాకెట్లు పరిచయం చేయనున్నామని, ప్రస్తుతం అందిస్తున్న పెరుగు ప్యాకెట్లలో 3.0 శాతం కొవ్వు, 8.5 శాతం ఇతర ప్రోటీన్లుంటాయని, వీటిలో కాస్త మార్పు చేసి 1.5 శాతం కొవ్వు, 11.5 శాతం ఇతర ప్రోటీన్లు ఉండే పెరుగు ప్యాకెట్లు పరిచయం చేయనున్నామని ఆవిన్ ఎండీ వినీత్ తెలిపారు.

రేపు 'జానపద భాషా వైభవం'

చెన్నై, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): 'వేద విజ్ఞాన వేదిక' ఆధ్వర్యంలో జరుగుతున్న 'తరతరాల తెలుగు కవిత' ఉపన్యాస ధారావాహిక 153వ ప్రసంగం జరుగనుంది. టి.నగర్, విజయరాఘవరోడ్డులో వున్న ఆంధ్రాక్లబ్‌లో ఈ నెల 29వ తేదీ సాయంత్రం పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం విశ్రాంతాచార్యులు డాక్టర్ చిగిచెర్ల కృష్ణారెడ్డి 'జానపద భాషా వైభవం' అనే అంశంపై ఉపన్యసించనున్నారు. ఈ కార్యక్రమానికి అందరూ ఆహ్వానితులేనని సంస్థ అధ్యక్షులు జేకే రెడ్డి, కార్యదర్శి కందనూరు మధు విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు.

పాఠశాలలకు వరుస సెలవులు

● కిక్కిరిసిన బస్సులు

అడయార్, సెప్టెంబరు 27: పాఠశాలలకు వరుస సెలవులు రావడంతో తమ పిల్లలతో సొంతూర్లకు అనేక మంది తల్లిదండ్రులు వెళ్లారు. దీంతో కీలాంబాక్కం బస్టాండులో ప్రయాణికుల రద్దీ ఏర్పడింది. ఈ రద్దీని దృష్టిలో ఉంచుకుని నడిపిన ప్రత్యేక బస్సులన్నీ ప్రయాణికులతో కిక్కిరిసిపోయాయి. విద్యార్థులకు త్రైమాసిక పరీక్షలు శుక్రవారంతో ముగిశాయి. దీంతో వచ్చే నెల ఆరో తేదీ వరకు సెలవులిచ్చారు. కొన్ని ప్రైవేటు పాఠశాలలకు రెండు రోజులు ముందుగానే సెలవులు ప్రకటించారు. ఈ నేపథ్యంలో విద్యార్థులతో తల్లిదండ్రులు తమ సొంతూర్లకు బయలుదేరి వెళ్లారు. వీరికోసం కిలాంబాక్కం బస్టాండు నుంచి రోజువారీగా నడిపే బస్సులతో పాటు అదనంగా మరో 500 బస్సులు నడిపారు. అలాగే, రోజువారీగా నడిచే రైళ్ళతో పాటు ప్రత్యేక రైళ్ళు కూడా ప్రయాణికులతో కిక్కిరిసిపోయాయి. ఈ రద్దీని నివారించేందుకు రవాణా శాఖ అదనపు బస్సులు నడపాలని ప్రయాణికులు కోరుతున్నారు.

విద్యార్థినులకు ప్రత్యేక విశ్రాంతి గది

● హైకోర్టుకు తెలిపిన రాష్ట్రప్రభుత్వం

పెరంబూర్, సెప్టెంబరు 27: రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలల్లో విద్యార్థినులకు ప్రత్యేక విశ్రాంతి గదులు నిర్మించేందుకు మూడు వారాల్లో రూ.8.55 కోట్లు చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఉత్తర్వులు జారీచేసింది. ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలలు, కళాశాలల్లో శానిటరీ నాప్‌కిన్ యంత్రాలు సక్రమంగా పర్యవేక్షించకపోవడంపై మద్రాసు హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి కృష్ణకుమార్, న్యాయమూర్తి బాలాజీతో కూడిన ధర్మాసనం సుమోటో కేసు నమోదుచేసి విచారిస్తోంది. ఈ పిటిషన్ గురువారం మళ్లీ విచారణకు రాగా ప్రభుత్వం తరఫున హాజరైన అదనపు సొలిసిటర్ జనరల్ రవీంద్రన్ రాష్ట్రంలోని 170 ప్రభుత్వ కళాశాలల్లో ఆటోమేటిక్ శానిటరీ నాప్‌కిన్ మెషీన్లు ఏర్పాటు చేశారని, ఆ ప్రాంతాల్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా ఈ యంత్రాల్లో నాప్‌కిన్‌లు ఏర్పాటుచేస్తున్నట్లు తెలిపారు. అలాగే, సుమారు 5,900 పాఠశాలల్లో కూడా ఈ యంత్రాలు ఏర్పాటు చేశామన్నారు. ఇక, ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలల్లో విద్యార్థినులకు ప్రత్యేక విశ్రాంతి గదుల ఏర్పాటుకు తలా రూ.5 లక్షల చొప్పున రూ.8.55 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. ప్రభుత్వ వాదన పరిగణలోకి తీసుకున్న ధర్మాసనం... ఈ నిధులను రాష్ట్రప్రభుత్వం మూడు వారాల్లో విడుదల చేయాలని, శానిటరీ నాప్‌కిన్ యంత్రాల పనితీరుపై ప్రభుత్వం నివేదిక దాఖలుచేయాలని ఉత్తర్వులు జారీచేసి, తదుపరి విచారణ వాయిదావేశారు.

సంక్షేమ సహాయాలు అందజేత



కో-ఆపరేటివ్ సంఘానికి ట్రాక్టర్ అందజేస్తున్న కలెక్టర్ సుబ్బులక్ష్మి

వేలూరు, సెప్టెంబరు 27: ఆనైకట్టు డివిజన్ కళనిపాక్కం పంచాయతీలో శుక్రవారం ప్రత్యేక గ్రీవెన్స్ జరిగింది. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ సుబ్బులక్ష్మి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. కార్యక్రమంలో భాగంగా వ్యవసాయ శాఖ తరఫున రాజగోపురం ప్రాథమిక కో-ఆపరేటివ్ బ్యాంక్‌కు రూ.10.37 లక్షల విలువైన ట్రాక్టర్, రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో ఆరుగురు లబ్ధిదారులకు రూ.5.18 లక్షల సహాయాలను కలెక్టర్ అందజేశారు.

'అందరికీ ఐఐటీ-చెన్నై' సమీక్షా సమావేశం

జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఐఐటీ-చెన్నైలో చదివే అవకాశం కల్పించే కార్యక్రమంపై శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ పథకం ద్వారా బీఎస్ ఇన్ డేటా స్కీమ్, బీఎస్ ఇన్ ఎలక్ట్రానిక్ సిస్టమ్ తదితర కోర్సుల్లో విద్యార్థులు చేరవచ్చు. జనవరి-ఫిబ్రవరి, మే-జూన్, సెప్టెంబరు-అక్టోబరు నెలల్లో మూడు సార్లు దరఖాస్తు చేసుకోవచ్చని జిల్లా కలెక్టర్ సుబ్బులక్ష్మి తెలిపారు సమావేశంలో జిల్లా ప్రధాన విద్యాధికారి మణిమొళి, జిల్లా విద్యాధికారులు దయాలన్, మోహన్, శంకర్, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల విక్రయాలు కొనసాగితే యువత భవిత నాశనమే

● ఈపీఎస్ ఆందోళన

చెన్నై, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గంజాయి తదితర మాదకద్రవ్యాల స్మగ్లింగ్, అమ్మకాలు కొనసాగితే తమిళ యువకుల భవిష్యత్తు మాత్రమే కాకుండా దేశ భవిష్యత్తే నాశనమయ్యే అవకాశం ఉందని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి, మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేస్తూ రెండు రోజుల క్రితం మద్రాసు హార్బర్ నుండి రూ.110 కోట్ల విలువైన 112 కేజీల మాదక ద్రవ్యాలు పట్టుబడ్డాయని, ఆస్ట్రేలియాకు వెళ్లనున్న సరకుల ఓడలో ఆ మాదక ద్రవ్యాలు పట్టుబడ్డాయని, ఆ సంఘటనకు సంబంధించి ఇద్దరు అరెస్టయినట్లు కూడా వార్తలు వచ్చాయని తెలిపారు. వారు రూ.2వేల కోట్ల మాదక ద్రవ్యాలను విదేశాలకు తరలించినట్లు పోలీసుల విచారణలోనూ వెల్లడైందన్నారు. డీఎంకే పాలకులు బహిరంగంగా కేంద్ర ప్రభుత్వాన్ని వ్యతిరేకించడం, తన కుటుంబీకుల సంక్షేమం కోసం లోలోపల కేంద్రానికి మద్దతు అనే ద్వంద్వ వైఖరిని అవలంభించడమే అలవాటుగా పెట్టుకున్నారని ఆయన విమర్శించారు.

పాఠశాల ఉపాధ్యాయుల వివరాలు సేకరణ

ఐసిఎఫ్, సెప్టెంబరు 27: అనుమతి లేకుండా ఉన్నత విద్య పూర్తిచేసిన పాఠశాల ఉపాధ్యాయుల వివరాలను పాఠశాల విద్యాశాఖ సేకరిస్తోంది. ప్రాథమిక పాఠశాలల్లో ఉన్న ఉపాధ్యాయులకు రాష్ట్రస్థాయిలో కాకుండా కేంద్ర స్థాయిలో ఉద్యోగ బదిలీలు కల్పించాలని కోరుతూ ఉపాధ్యాయుల సమాఖ్య ఆధ్వర్యంలో ఈ నెల 30, అక్టోబరు 1వ తేది సచివాలయాన్ని ముట్టడించి ఆందోళన చేపట్టనున్నట్లు ప్రకటించారు. దీంతో పాఠశాల విద్యాశాఖ మంత్రి మహేష్, అధికారులు ఈ నెల 23వ తేది ఉపాధ్యాయులతో చర్చలు జరిపి, వారి సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఆ ప్రకారం, రాష్ట్రంలో ఉన్న పంచాయతి యూనియన్, మున్సిపాలిటీ, ప్రభుత్వ, ప్రాథమిక, మాధ్యమిక పాఠశాలల్లో పనిచేసే వారిలో శాఖ అనుమతి లేకుండా ఉన్నత విద్య అభ్యసించిన ఉపాధ్యాయుల పూర్తి వివరాలు పంపించాలని జిల్లా విద్యాధికారులకు ప్రాథమిక విద్యాశాఖ డైరెక్టర్ ఉత్తర్వులు జారీచేశారు.

హృదయ దినోత్సవం సందర్భంగా ఎగ్జిబిషన్



కార్యక్రమ ప్రారంభోత్సవంలో అతిథులు, నిర్వాహకులు

వేలూరు, సెప్టెంబరు 27: స్థానిక సీఎంసీ ఆస్పత్రిలో ప్రపంచ హృదయ దినోత్సవం సందర్భంగా అవగాహన ఎగ్జిబిషన్ ఏర్పాటుచేశారు. కార్యక్రమానికి డా.మధు ఆండ్రోఫిలిప్ ఆహ్వానం పలుకగా, డా.విజి సామువేల్‌మేసన్, రాణిపేట కలెక్టర్ చంద్రకళ పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా గుండె సంబంధిత సమస్యలు, చికిత్సలపై నిర్వహించిన వ్యాసరచన పోటీ విజేతలకు బహుమతులు అందజేశారు. గుండె సమస్యలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఆయా సమస్యలపై ప్రజలకు అవగాహన కల్పించేలా ఈ కార్యక్రమం ఏర్పాటుచేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

50 మందులు నాసిరకం

ఐసిఎఫ్, సెప్టెంబరు 27: పేరాసిటామల్, షెల్‌కాల్, విటమిన్-డీ3 వంటి 50కి పైగా మందులు నాసిరకమైనవని కేంద్ర మందుల నాణ్యత నిర్ధారణ సంస్థ తెలిపింది. మందుల నాణ్యతను అప్పుడప్పుడూ ఈ సంస్థ నిర్ధారించి నాసిరకం మందులను నిషేధిస్తోంది. ఆ ప్రకారం ఆగస్టులో చేపట్టిన తనిఖీల్లో విటమిన్ బి కాంప్లెక్స్, విటమిన్ సి సాఫ్ట్‌జెల్స్, షుగర్ మాత్రలు సహా 50కి పైగా మందులు నాణ్యత లేనివిగా గుర్తించి ఆ వివరాలు విడుదల చేసింది.

రేస్ క్లబ్ వ్యవహారంపై చర్చలు

● హైకోర్టుకు తెలిపిన రాష్ట్ర ప్రభుత్వం

పెరంబూర్, సెప్టెంబరు 27: చెన్నై రేస్ క్లబ్ వ్యవహారంపై సంప్రదింపులు జరుపుతున్నామని రాష్ట్రప్రభుత్వం హైకోర్టుకు తెలియజేసింది. అద్దె బకాయి రూ.730 కోట్లు చెల్లించలేకపోవడంతో, మద్రాసు హైకోర్టు ఉత్తర్వుల ఆధారంగా చెన్నై రేస్ క్లబ్‌కు సీలు వేశారు. అనంతరం కోర్టు ఉత్తర్వులకు వ్యతిరేకంగా, లీజు రద్దుచేయాలని కోరుతూ రేస్ క్లబ్ యాజమాన్యం హైకోర్టు ఉత్తర్వుల ఉల్లంఘన కేసు దాఖలుచేసింది.ఈకేసున్యాయమూర్తులు ఎస్ఎస్ సుందర్, రాజశేఖర్‌తో కూడిన ధర్మాసనం ఎదుట విచారణకు వచ్చింది. ఆ సమయంలో ప్రభుత్వం తరఫున... బకాయి రద్దు వ్యవహారంలో రాష్ట్ర ప్రభుత్వం, రేస్ క్లబ్ నిర్వాహకుల మధ్య చర్చలు జరుగుతున్నాయని తెలిపారు. ఈ వాదన పరిగణలోకి తీసుకున్న ధర్మాసనం, తదుపరి విచారణ మూడు వారాలకు వాయిదావేసింది.

7న ఎన్నెల్సీ కార్యాలయం ఎదుట సీపీఎం ధర్నా

పెరంబూర్, సెప్టెంబరు 27: నైవేలీలోని ఎన్నెల్సీ కార్యాలయం ఎదుట అక్టోబరు 7వ తేది సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా చేపట్టనున్నారు. ఈ మేరకు ఆ పార్టీ విడుదల చేసిన ప్రకటనలో... ఎన్నెల్సీ సేకరించిన భూములకు పూర్తి పరిహారం అందజేయాలి, భూములు ఇచ్చిన కుటుంబాల్లోని ఒకరికి ఉద్యోగం కల్పించాలి, ఈ సంస్థలో ఏఎంసీ పనులకు 150 మంది పొరుగు రాష్ట్రాలకు చెందిన వారిని నియమించడాన్ని నిరసిస్తూ చేపట్టనున్న ఈ ధర్నాకు పార్టీ దిండుగల్ ఎంపీ సచ్చిదానందం నేతృత్వం వహిస్తారని సీపీఎం తెలియజేసింది.

సీఎంను కలిసిన సెంథిల్ బాలాజి



చెన్నై, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మనీలాండరింగ్ కేసులో సుదీర్ఘకాలం జైలుపాలై, బెయిల్‌పై బయటకు వచ్చిన మాజీమంత్రి సెంథిల్ బాలాజీ శుక్రవారం రాత్రి ముఖ్యమంత్రి స్టాలిన్‌కు పాదాభివందనం చేసి ఆశీస్సులందుకున్నారు. ఢిల్లీ పర్యటన ముగించుకొని రాత్రి 7.30 గంటలకు సీఎం నగరానికి తిరిగిరాగా, ఆయనకు అక్కడ స్వాగతం పలికిన సెంథిల్ బాలాజీ పాదాభివందనం చేశారు. అనంతరం సీఎంతో కొద్దిసేపు ముచ్చటించారు. ఇదిలా వుండగా సీఎంకు స్వాగతం పలికిన మంత్రుల వరుసలో సెంథిల్ బాలాజీ ముందుండడం గమనార్హం.

పళనిలో అన్నదానం నాణ్యత పరిశీలన



అన్నం నాణ్యత పరిశీలిస్తున్న కమిటీ సభ్యులు

పెరంబూర్, సెప్టెంబరు 27: పళని దండాయుధపాణి ఆలయాన్ని శాసనసభ స్టాండింగ్ కమిటీ అధ్యక్షుడు వేల్‌మురుగన్ నేతృత్వంలో బృందం శుక్రవారం పరిశీలించింది. ఈ కమిటీ రెండు రోజుల పర్యటనలో భాగంగా గురువారం దిండుగల్ జిల్లా చేరుకుంది. ఈ బృందం శుక్రవారం ఉదయం దండాయుధపాణి ఆలయానికి వెళ్లి స్వామి దర్శనం చేసుకున్నారు. అనంతరం కొండ ఆలయ ప్రాంగణంలోని సిద్ధ ఆస్పత్రి సహాయ కేంద్రం, అన్నదానం హాలు, వంటగది తదితరాలను పరిశీలించింది. అలాగే, అన్నదానం నాణ్యత, రుచి తదితరాలను భక్తులను కమిటీ అడిగి తెలుసుకుంది. ఈ బృందం వెంట జిల్లా కలెక్టర్ పూంగొడి, సబ్ కలెక్టర్ కిషన్‌కుమార్, ఎమ్మెల్యేలు అరవింద్ రమేష్, అరుళ్, చక్రపాణి, నల్లతంబి, మాంగుడి, మోహన్, జయకుమార్ తదితరులున్నారు.

చోళుల కాలం నాటి నాణెం అప్పగింత



నాణెం అప్పగించిన విద్యార్థినులు

ఐసిఎఫ్, సెప్టెంబరు 27: రామనాథపురం జిల్లాలో తమకు దొరికిన రాజరాజచోళుల కాలం నాటి నాణెంను ఇద్దరు విద్యార్థినులు అధికారులకు అప్పగించారు. తిరుప్పుల్లాని ప్రాంతంలో ఉన్న ప్రభుత్వ మహోన్నత పాఠశాలలో పురావస్తు, శిలాశాసనాల పరిశోధన సంఘం ఉంది. ప్రాచీన వస్తువులు గుర్తించడంపై విద్యార్థులకు ఈ సంఘం శిక్షణ ఇస్తోంది. ఈ నేపథ్యంలో, పాఠశాలలో చదివే 8వ తరగతి విద్యార్థినులు మణిమేఘలై, దివ్యదర్శిని, కనిష్కశ్రీ ఇంటి ముందు మట్టిలో గొయ్యి తీసి ఆడుకుంటుండగా, పురాతన నాణెం లభించింది. ఈ నాణేన్ని పాఠశాలలో ఉన్న పురావస్తు పరిశోధకులకు అందజేయగా, మొదటి రాజరాజచోళుని కాలానికి చెందినదిగా గుర్తించారు. బంగారు, వెండి, రాగి మిశ్రమాలతో ఈ నాణెం తయారుచేసినట్లు పరిశోధకులు తెలిపారు.

జీరో లక్ష్యానికి మలేరియా జ్వరాలు

అడయార్, సెప్టెంబరు 27: రాష్ట్రంలో మలేరియా జ్వరాలను పూర్తిగా లేకుండా చేసేందుకు వీలుగా ప్రభుత్వ ప్రజా వైద్య ఆరోగ్య శాఖ అనేక కార్యక్రమాలతో పాటు అవగాహనా కార్యక్రమాలను చేపడుతుంది. వీటి ఫలితంగా మలేరియా జ్వరాల సంఖ్య జీరోకు చేరువగా తెచ్చారు. ఈ విషయంపై ప్రజా ఆరోగ్య శాఖ సంచాలకులు సెల్వవినాయగం ఒక ప్రకటన విడుదల చేశారు. మలేరియాను పూర్తిగా నిర్మించేందుకు వివిధ రకాల పరీక్షలు, అవగాహన కార్యక్రమాలను చేపడుతున్నట్టు చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా మలేరియా జ్వరాల సంఖ్య జీరోకు తెచ్చేలా ముందుకుసాగుతున్నాం. 1990 నుంచి 1998 మధ్య కాలంలో యేడాదిరి 50 వేల మంది మలేరియా జ్వరం బారినపడేవారు. ఇపుడు మలేరియా బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విస్తృతంగా అవగాహన చేస్తున్నామని, ఈ కారణంగా రాష్ట్రంలో మలేరియా జ్వరాల నమోదు దాదాపుగా తగ్గిపోయిందనీ, త్వరలోనే జీరో సంఖ్యకు చేరుకుంటామని ఆయన పేర్కొన్నారు.

నవంబరు 2 నుంచి తిరుచెందూర్ ఆలయంలో స్కంద షష్ఠి ఉత్సవాలు

● ప్రత్యేక దర్శనం టిక్కెట్ రూ.1,000

ప్యారీస్, సెప్టెంబరు 27: తూత్తుకుడి జిల్లా తిరుచెందూర్ సుబ్రమణ్యస్వామి ఆలయంలో నవంబరు 2 నుంచి 9వ తేది వరకు స్కంద షష్ఠి ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఈ ఏడాది ఉత్సవాలకు భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చే అవకాశముందని, వ్రతదీక్ష చేపట్టిన భక్తులు ఆలయ ప్రాంగణంలోనే ఉండేలా వసతులు కల్పించారు. ప్రస్తుతం ప్రత్యేక దర్శనానికి రూ.100 చొప్పున వసూలుచేస్తున్న నేపథ్యంలో, స్కంద షష్ఠి సందర్భంగా ప్రత్యేక దర్శనానికి రూ.1,000 నిర్ణయించారు. దర్శనం ఫీజు పెంచడంపై ప్రజలు, భక్తులు తమ అభిప్రాయాలను తెలియజేయవచ్చని ఆలయ నిర్వాహక కమిటీ తెలిపింది.

తిరుప్పూరు, ఈరోడ్‌లో ముమ్మరంగా టీవీకే రంగుల ధోవతి, చొక్కాల తయారీ

చెన్నై, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): సినీ హీరో విజయ్ నాయకత్వంలోని తమిళగ వెట్రి కళగం (టీవీకే) మహానాడు అక్టోబర్ 27న విక్రవాండిలో జరుగనుండటంతో తిరుప్పూరు, ఈరోడ్‌లో ఆ పార్టీ రంగుల ధోవతులు, చొక్కాలు, టోపీలు తయారుచేస్తున్నారు. మహానాడుకు హాజరయ్యే పార్టీ ప్రముఖులు, నాయకులు, కార్యకర్తలు వీలైనంత వరకూ తమిళసంప్రదాయాన్ని చాటేలా ధోవతులు, చొక్కాలు ధరించాలని టీవీకే ప్రధాన కార్యదర్శి బుస్సీ ఆనంద్ ప్రకటించారు. దీంతో తిరుప్పూరు బనియన్ల తయారీ ఫ్యాక్టరీల్లో వేల సంఖ్యలో టీవీకే రంగులున్న ధోవతులు, చొక్కాలు, అంగవస్త్రాలు తయారుచేస్తున్నారు. ఈ మేరకు టీవీకే నుండి భారీగా ఆర్డర్లు వచ్చినట్లు ఈరోడ్, తిరుప్పూరు జౌళి కర్మాగారాల యజమానులు చెబుతున్నారు.

ఉచిత విద్యుత్ రద్దు వదంతులు మాత్రమే

● స్పష్టం చేసిన విద్యుత్ బోర్డు

ప్యారీస్, సెప్టెంబరు 27: ఇళ్లకు సరఫరా చేసే 100 యూనిట్ల ఉచిత విద్యుత్ రద్దు చేయనున్నట్లు వస్తున్న వార్తలు వదంతులు మాత్రమేనని విద్యుత్ బోర్డు స్పష్టం చేసింది. రాష్ట్రంలో ప్రస్తుతం రెండు నెలలకు ఒకసారి విద్యుత్ రీడింగ్ నమోదు కొనసాగుతున్న నేపథ్యంలో, ఇందులో వంద యూనిట్ల విద్యుత్ ఇళ్లకు ఉచితంగా ఇస్తున్నారు. అయితే ఇటీవల ఉచిత విద్యుత్‌ను రద్దు చేసేందుకు విద్యుత్ బోర్డు పరిశీలిస్తోందని సామాజిక మాధ్యమాల్లో వార్తలు వస్తున్నాయని, వినియోగదారులు ఈ వార్తలు నమ్మరాదని అధికారులు తెలిపారు.

స్టాండింగ్ కమిటీల చైర్మన్లుగా తిరుచ్చి శివ, కనిమొళి

ప్యారీస్, సెప్టెంబరు 27:రాష్ట్రానికి చెందిన డీఎంకే ఎంపీలకు రెండు కీలకమైన పార్లమెంటు స్థాయి సంఘాల చైర్మెన్ పదవులు దక్కాయి. తిరుచ్చి శివ పరిశ్రమల స్టాండింగ్ కమిటీ చైర్మెన్‌గా, కనిమొళి ఆహార వినియోగదారుల వ్యవహార శాఖ స్టాండింగ్ కమిటీ చైర్మెన్‌గా నియమితులయ్యారు. ఇందుకు సంబంధించి గురువారం రాత్రి లోక్‌సభ సచివాలయం విడుదల చేసిన బులెటిన్‌లో తెలిపింది.

విజ్ఞానాన్ని పంచే వీఐటీ 'గ్రావిటాస్- 24'



వైజ్ఞానిక ప్రదర్శనలో ప్రాజెక్టులు పరిశీలిస్తున్న అతిథులు, నిర్వాహకులు

వేలూరు, సెప్టెంబరు 27: స్థానిక కాట్పాడిలోని వేలూరు వీఐటీ యూనివర్శిటీలో 'వీఐటీ గ్రావిటాస్' విజ్ఞాన వేడుకలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. కార్యక్రమంలో వర్శిటీ ఛాన్సలర్ విశ్వనాథన్ పాల్గొని డ్రోన్ రోబో ఎగురవేసి వేడుకలు లాంఛనంగా ప్రారంభించారు. వేడుకల్లో వర్శిటీ ఉపాధ్యక్షులు సెల్వం, శంకర్, ఆటో టెస్క్ సంస్థ విద్యా మేనేజర్ ఆనంద్ పూజారి తదితరులు పాల్గొన్నారు. ముఖ్యఅతిథిగా డేనియలి ఇండియా స్థాపక అధ్యక్షుడు మనోరంజన్‌రామ్ పాల్గొని విద్యార్థినీ, విద్యార్థులు రూపొందించిన పరిశోధనలు తిలకించారు. దీనిలో రోబోలు, కార్లు, బ్యాటరీ వాహనాలున్నాయి. అలాగే, 200లకు పైగా ప్రాజెక్టులు ప్రదర్శనలో ఉంచారు. ఈ నెల 29 వరకు జరిగే ఈ వేడుకల్లో 35కు పైగా సెమినార్లు నిర్వహించనున్నారు. వేడుకల్లో 50 దేశాలకు చెందిన 625 కళాశాలలు, విశ్వవిద్యాలయాలకు చెందిన 27,000 మంది విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

కొడైకెనాల్ అటవీ ప్రాంతాల్లో వాహనాల నిషేధం

పెరంబూర్, సెప్టెంబరు 27: దిండుగల్ జిల్లాలో ప్రముఖ పర్యాటక కేంద్రం కొడైకెనాల్‌లోని అటవీ పర్యాటక ప్రాంతాలకు బస్సులు, భారీ వాహనాల రాకపోకలకు నిషేధం విధించారు. శనివారం నుంచి ఈ నిబంధన అమలులోకి రానుందని, వాహనాలు పిల్లర్ రాక్, పైన్ అడవులు సహా పర్యాటక ప్రాంతాలకు పంబార్‌పురం మీదుగా వెళ్లాలని అటవీ శాఖ ఆదేశించింది.

మద్రాసు వర్సిటీకి మళ్లీ బాంబు బెదిరింపు

పెరంబూర్, సెప్టెంబరు 27: స్థానిక మెరీనా బీచ్ సమీపంలోని మద్రాసు విశ్వవిద్యాలయానికి 12వ సారి బాంబు బెదిరింపు వచ్చింది. ఈ-మెయిల్ ద్వారా వచ్చిన ఈ బెదింపు విషయాన్ని వర్సిటీ అధికారులు పోలీసులకు తెలియజేశారు. బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్‌తో అక్కడకు చేరుకున్న పోలీసులు, వర్శిటీ ప్రాంగణంతా గాలించి ఈ ఫేక్ బెదిరింపుగా నిర్ధారించి, ఈ-మెయిల్ పంపిన వారి కోసం విచారిస్తున్నారు.

వండలూరు పార్క్‌లో రెండు జింకల మృతి

ఐసిఎఫ్, సెప్టెంబరు 27: స్థానిక వండలూరు జూ పార్క్‌లో రెండు జింకలు మృతిచెందాయి. ఇక్కడ వందలాది జింకలను సంరక్షిస్తున్నారు. వాటిలో రెండు జింకలు మృతిచెందాయి. ఈ విషయమై పార్క్ నిర్వాహకులు మాట్లాడుతూ... జింకలు ఎలా మృతిచెందాయని అనే విషయం పోస్టుమార్టం నివేదిక అందితే తెలుస్తుందని తెలిపారు. మృతి చెందిన జింకలను సమీపంలోని అడవిలో ఖననం చేసినట్లు అధికారులు తెలిపారు.

ప్లాస్టిక్ పేపర్‌లో ఇడ్లీలు ఉడికిస్తే చర్యలు

ఐసిఎఫ్, సెప్టెంబరు 27: ప్లాస్టిక్ పేపర్లలో ఇడ్లీలు ఉడికించే హోటళ్లపై చర్యలు చేపట్టనున్నట్లు అధికారులు హెచ్చరించారు. నగరంలో హోటళ్లు, తోపుడు బండ్లు, ఫుట్‌పాత్ దుకాణాల్లో ఇడ్లీ పాత్రల్లో ప్లాస్టిక్ పేపర్లు ఉంచి ఇడ్లీ ఉడికిస్తున్నట్లు ఆహార భద్రత శాఖ అధికారులకు ఫిర్యాదులందాయి. అలా ఉడికించిన ఇడ్లీలు తిన్న వారు పలువురు అస్వస్థతకు గురైనట్లు తెలిసింది. ఇలాంటి చర్యలకు పాల్పడితే అధిక జరిమానా విధించడంతో పాటు హోటళ్ల లైసెన్స్ రద్దుతో పాటు సీలు వేస్తామని అధికారులు హెచ్చరించారు.

మాజీ సైనికుడి ఇంట్లో నగల దోపిడీ

ప్యారీస్, సెప్టెంబరు 27: తిరువళ్లూర్ జిల్లా తిరుత్తణి సమీపంలోని కొత్తకుప్పం గ్రామంలో నివసిస్తున్న మాజీ సైనికుడి ఇంట్లో చొరబడిన గుర్తుతెలియని వ్యక్తులు 100 సవర్ల నగలు, కిలో వెండి, రూ.77,000 నగదు దోచుకొని పరారైనట్లు పోలీసులు తెలిపారు. కొత్తకుప్పం గ్రామానికి చెందిన మాజీ సైనికుడు విజయలుకు ఇద్దరు కుమార్తెలున్నారు. విజయలు బంధువు తిరుత్తణి సమీపంలోని కేజీ కండిగలో మరణించడంతో ఆయన అంత్యక్రియలకు విజయలు ఇంటికి తాళం వేసి కుటుంబంతో కలిసి వెళ్లారు. గురువారం రాత్రి ఇంటికి తిరిగొచ్చిన విజయలు బీరువా ధ్వంసమై ఉండడం చూసి అందులో నగలు, నగదు, వెండి వస్తువులు దోపిడీకి గురైనట్లు గుర్తించి పొదటూరుపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై కేసు నమోదుచేసిన పోలీసులు పరారైన దోపిడీ ముఠా కోసం గాలిస్తున్నారు.

కాలు విరిగిన నిందితులకు కట్టు కట్టించిన పోలీసులు

అడయార్, సెప్టెంబరు 27: స్థానిక వండలూరు సమీపంలో గంజాయితో పట్టుబడిన ఇద్దరు నిందితులు... పోలీసుల నుంచి తప్పించుకుని ప్రయత్నంలో కిందపడటంతో కాలు విరిగింది. దీంతో వారిని పోలీసులు ఆస్పత్రికి తీసుకెళ్ళి కట్టు కట్టించారు. వండలూరు రైల్వే స్టేషన్ సమీపంలో ఓట్టేరి పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో ద్విచక్రవాహనంపై వచ్చిన ఇద్దరు వ్యక్తులను ఆపి తనిఖీ చేయగా, వారివద్ద గంజాయి ఉన్నట్టు గుర్తించారు. పైగా వారిలో ఒకరు డీఎంకే నేత ఆరా మదన్ హత్య కేసులో నిందితుడని విచారణలో తేలింది. ఈ క్రమంలో పోలీసుల నుంచి వారు తప్పించుకునేందుకు పరుగులుపెట్టి, అదుపుతప్పి కిందపడ్డారు. దీంతో వారిద్దరికి కాళ్ళు విరగడంతో పోలీసులు వారిని ఆస్పత్రికి తీసుకెళ్ళి కట్టు కట్టించారు. కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు.

తూత్తుకుడి టాస్మాక్ గోదాములో ఏసీబీ తనిఖీలు

● రూ.1.50 లక్షల స్వాధీనం

అడయార్, సెప్టెంబరు 27: తూత్తుకుడిలోని టాస్మాక్ గోదాములో ఏసీబీ అధికారులు గురువారం రాత్రి తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో సరైన ఆధారాలు లేని రూ.1.50 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈ జిల్లాలో 137 టాస్మాక్ దుకాణాలున్నాయి. ఈ దుకాణాలకు మద్యాన్ని సరఫరా చేసే జోనల్ మేనేజర్ కార్యాలయం సిప్‌కాట్ ప్రాంగణంలో ఉంది. ఇక్కడే టాస్మాక్ గోదాము కూడా ఉంది. ఇక్కడ నుంచి అక్రమంగా మద్యాన్ని సరఫరా చేస్తున్నట్టు ఆరోపణలు వచ్చాయి. దీంతో ఏసీబీ అధికారులు ఆకస్మికంగా తనిఖీలు చేయగా, లెక్కల్లో చూపని రూ.1.50 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. దీనికి సంబంధించి పోలీసులు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు.

గన్‌పాయింట్‌లో ఎస్టేట్ మణి అరెస్టు

అడయార్, సెప్టెంబరు 27: దేవేంద్రకుల వేళాలర్ యువజన విభాగం ప్రధాన నిర్వాహకుడు పశుపతి పాండ్యన్ అనుచరుడు ఎస్టేట్ మణిని పోలీసులు గన్ పాయింట్‌లో అరెస్టు చేశారు. ఎస్టేట్ మణిపై అనేక హత్యాయత్న కేసులు నమోదైవున్నాయి. ఈ నేపథ్యంలో బెయిల్‌పై విడుదలైన ఎస్టేట్ మణి ఆ తర్వాత విచారణకు హాజరుకాకుండా ముంబై పారిపోయాడు. అప్పటి నుంచి పోలీసులు అతని కోసం గాలిస్తున్నారు. ఈ క్రమంలో ఒక వివాహ కార్యక్రమానికి ఎస్టేట్ మణి వచ్చినట్టు వేలూరు పోలీసులకు సమాచారం వచ్చింది. దీంతో నిఘా పెట్టిన పోలీసులు... కేరళ రాష్ట్రంలోని మూణార్ సమీపంలో ఎస్టేట్ మణిని గన్‌పాయింట్‌లో అరెస్టు చేసి, గట్టి భద్రత మధ్య వేలూరుకు తీసుకొస్తున్నారు.

సెంథిల్ బాలాజి బెయిలుపై విడుదల కరూర్‌లో 5,000 మందికి విందు



సెంథిల్ బాలాజీ ఫొటోకు పాలాభిషేకం చేస్తున్న కార్యకర్తలు

ప్యారీస్, సెప్టెంబరు 27: మాజీ మంత్రి సెంథిల్ బాలాజి బెయిలుపై విడుదలవడంతో కరూర్‌లో డీఎంకేకు చెందిన పారిశ్రామికవేత్త శుక్రవారం 5,000 మందికి బిర్యానీ విందు ఏర్పాటు చేశారు. కరూర్ జిల్లా సెంబాడపాళయంకు చెందిన తోగైమురుగన్ అనే పారిశ్రామికవేత్త డీఎంకే నిర్వాహకుడిగా వ్యవహరిస్తున్నారు. మనీలాండరింగ్ కేసులో సెంథిల్ బాలాజి గురువారం రాత్రి బెయిలుపై విడుదల కావడంతో కరూర్‌లో సంబరాలుగా జరుపుకున్నారు. 1,500 కిలోల చికెన్, 5,000 గుడ్లతో భోజనం సిద్ధం చేసి ఉదయం 10 గంటల నుంచే ప్రజలకు వడ్డించారు. ఈ వేడుకల్లో భాగంగా సెంథిల్ బాలాజి ఫ్లెక్సీకి పాలాభిషేకం చేశారు.

ఓటీటీలో 7 భాషల్లో విడుదల కానున్న 'వాళై'


'వాళై'లో ఓ దృశ్యం

మారి సెల్వరాజ్ దర్శకత్వంలో వచ్చిన 'వాళై' చిత్రం ఓటీటీ రిలీజ్ తేదీ అధికారికంగా ప్రకటించారు. వచ్చే నెల 11వ తేదీ నుంచి డిస్నీ ప్లస్ హాట్‌స్టార్‌లో స్ట్రీమింగ్ కానున్న ఈ చిత్రం తమిళం, తెలుగు, మలయాళం, కన్నడ, మరాఠీ, హిందీ, బెంగాలీ భాషల్లో విడుదల చేయనున్నట్టు ఓటీటీ ప్లాట్‌ఫాం వెల్లడించింది. 'పరియేరుమ్ పెరుమాళ్', 'కర్ణన్', 'మామన్నన్' చిత్రాల తర్వాత మారి సెల్వరాజ్ రూపొందించిన 'వాళై' ఆగస్టు 23వ తేదీ విడుదలై ఘన విజయం సాధించింది. యధార్థ కథ ఆధారంగా రూపొందించిన ఈ సినిమాలో నిఖిలా విమల్, కలైయరసన్, దివ్యా దురైస్వామిలు ప్రధాన పాత్రలు పోషించారు. పైగా ఈ సినిమాను చూసిన సినీ హీరోలు, దర్శకులు తీవ్ర భావోద్వేగానికి లోనయ్యారు. ఈ నేపథ్యంలో వచ్చే నెల 11వ తేదీ నుంచి ఓటీటీలో విడుదల చేయనున్నట్టు అధికారికంగా వెల్లడించారు.

తుది దశకు చేరుకున్న 'రెట్టతల' చిత్రీకరణ


అరుణ్ విజయ్, సిద్ధి ఇద్నానీ, తిరుకుమరన్

శివకార్తికేయన్ హీరోగా 'మాన్ కరాటే' చిత్రానికి దర్శకత్వం వహించిన తిరుకుమరన్.. ఇపుడు అరుణ్ విజయ్ కథానాయకుడిగా తెరకెక్కిస్తున్న 'రెట్టతల' చిత్రం షూటింగ్ చివరి దశకు చేరుకుంది. ఇందులో సిద్ధి ఇద్నానీ, ధాన్య రవిచంద్రన్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. శ్యామ్ సీఎస్ సంగీతం. బీటీజీ బ్యానరుపై భారీ బడ్జెట్‌తో ఈ చిత్రం నిర్మితమవుతుంది. ఇందులో అరుణ్ విజయ్ ద్విపాత్రాభినయం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇప్పటికే తొలి షెడ్యూల్ పూర్తి చేసుకుని, చివరి దశ నిర్మాణ పనులను గోవాలో చేస్తున్నారు. ఇందుకోసం యూనిట్ సభ్యులందరినీ విమానంలో గోవాకు తీసుకెళ్ళగా, యూనిట్ సభ్యులంతా విమానం వద్ద దిగిన ఫొటోలను చిత్ర నిర్మాణ సంస్థ విడుదల చేసింది. తుదిదశ నిర్మాణం, పోస్ట్ ప్రొడక్షన్ పనులు పూర్తి చేసి వీలైనంత త్వరగా విడుదల చేయాలన్న ప్లాన్‌లో దర్శక నిర్మాతలున్నారు.

రాహుల్ ఆశీస్సులు పొందిన మేఘా ఆకాష్ దంపతులు


రాహుల్‌తో మేఘా ఆకాష్ దంపతులు, తిరునావుక్కరసు

హీరోయిన్ మేఘా ఆకాష్ తన భర్తతో కలిసి కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని కలిసి ఆయన ఆశీర్వాదం తీసుకున్నారు. వారి వెంట టీఎన్‌సీసీకి చెందిన సీనియర్ నేత ఎస్.తిరునావుక్కరసు కూడా ఉన్నారు. కార్తీక్ సుబ్బురాజ్ దర్శకత్వంలో 2019లో వచ్చిన 'పేట్ట' చిత్రం ద్వారా తమిళ చిత్రపరిశ్రమలోకి అడుగుపెట్టిన మేఘా ఆకాష్ ఆ తర్వాత ధనుష్ సరసన 'ఎన్నై నోక్కి పాయుం తోట్టా', సింబుతో 'వందా రాజావా దాన్ వరువేన్'తో పాటు ఇతర హీరోలతో కలిసి పలు చిత్రాల్లో నటించారు. ఆమె చివరిసారిగా 'సభానాయగన్', 'వడకుపట్టి రామస్వామి', 'మళై పిడిక్కాద మణిదన్' చిత్రాల్లో నటించారు. అదే సమయంలో కాంగ్రెస్ సీనియర్ నేత ఎస్.తిరునావుక్కరసు రెండో కుమారుడు సాయి విష్ణును ప్రేమించి ఇటీవల పెళ్ళి చేసుకున్నారు. చెన్నై నగరంలో జరిగిన వీరి వివాహానికి ముఖ్యమంత్రి స్టాలిన్‌తో పాటు పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ నేపథ్యంలో ఢిల్లీకి వెళ్ళి రాహుల్ గాంధీని కలిసి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా తీసిన ఫొటోలను ఆమె సోషల్ మీడియాలో షేర్ చేశారు.

చిత్రజ్యోతి

శారీరక బంధం కాదు.. వ్యాపార సంబంధమే..!


● జయం రవితో రిలేషన్‌పై కెనీషా వివరణ

హీరో జయం రవి తన భార్య ఆర్తి నుంచి విడాకులు తీసుకోవాలని నిర్ణయం తీసుకోవడం వెనుక తాను కారణం కాదని బెంగళూరుకు చెందిన గాయని కెనీషా ఫ్రాన్సిస్ స్పష్టం చేశారు. హీరో జయం రవి తన భార్య నుంచి విడాకులు కోరుతూ కోర్టులో పిటిషన్ వేశారు. కెనీషాతో ఉన్న పరిచయం కారణంగానే జయం రవి ఈ నిర్ణయం తీసుకున్నట్టు ప్రచారం సాగుతుంది. అయితే, తన నిర్ణయానికి గాయని కెనీషా ఫ్రాన్సిస్ ప్రధాన కారణం కాదని హీరో జయం రవి ఇప్పటికే క్లారిటీ ఇచ్చారు. ఈ నేపథ్యంలో తాజాగా కెనీషా కూడా ఓ ఆంగ్ల పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో తమ మధ్య ఉన్న రిలేషన్‌షిప్‌పై క్లారిటీ ఇచ్చారు. దీనిపై ఆమె మాట్లాడుతూ, 'జయం రవికి నాకు మధ్య ఉన్న సంబంధం శారీరక బంధం కాదు.


కెనీషా, జయం రవి

కేవలం వ్యాపారపరమైన సంబంధం మాత్రమే. జయం రవి నా స్నేహితుడు. నా శ్రేయోభిలాషి మాత్రమే. ఆయన తీసుకున్న విడాకుల నిర్ణయానికి నేను కారణం కాదు. నేనే కారణమంటూ జరుగుతున్న ప్రచారం పూర్తిగా అవాస్తవం. ఆర్తికి విడాకుల నోటీసు పంపించేంత వరకు జయం రవి గురించి పెద్దగా నాకు తెలియదు. పైగా, ఇది నా సమస్య కాదు. ఈ వివాదంలోకి నన్ను లాగొద్దు. అందుకు సమయం కూడా నాకు లేదు' అని కెనీషా ఫ్రాన్సిస్ పేర్కొన్నారు.


చాందినిక



మతం, ప్రాంతం, జాతి, కులం, వయోభేదాలన్నింటికీ అతీతమైనది విద్య. ఆ చదువే అందరికీ 'శ్రీరామరక్ష'. 'మంచి చెడ్డలు నేర్పేది విద్య. చదువులమ్మను నిష్ఠగా, నిబద్ధతతో అర్జించే విద్యార్థే జీవితంలో విజయం సాధిస్తారు. 'శ్రద్ధ లేని యెడల చదువుసాములు రావు, శ్రద్ధయున్న రాని చదువులేదు' అన్న నార్ల వారి మాటలు అక్షరసత్యాలు. దానికి ఒక ఉదాహరణ 'చాందినిక'. ఈ తెలుగు విద్యార్థిని మద్రాసు విశ్వవిద్యాలయం నుంచి పీజీ చేసి 'స్వర్ణ పతకం' అందుకొంది. మంగళవారం (ఈ నెల 24వ తేది) జరిగిన మద్రాసు విశ్వవిద్యాలయ స్నాతకోత్సవంలో ఆమె గవర్నర్ రవి చేతుల మీదుగా బంగారం పతకాన్ని స్వీకరించింది. సంకల్పబలం, ఆత్మవిశ్వాసం ఉంటే గెలుపు సొంతం అవుతుందని నిరూపించింది. ఆమే నేటి మన 'తరుణి' చాందినిక, విద్యార్థినిగా ఆమె విజయ ప్రస్థానం ఈనాటి 'తరుణి'లో...

- వేళచ్చేరి

చదువును ప్రేమిస్తే జీవితం ఫలప్రదం

● చదువుల తల్లి 'చాందినిక' ● తెలుగు తేజానికి 'స్వర్ణ పతకం'

తరుణి

చాందినిక పుట్టింది ఆంధ్రప్రదేశ్‌లోని తాడేపల్లిగూడెంలో అయినా, పెరిగింది మాత్రం చెన్నైలోనే. ఆమె తల్లి తారకలక్ష్మి, ఒక ప్రైవేటు కంపెనీ ఉద్యోగిని. తండ్రి కళాకరణ్ వ్యాపారి. కోడంబాక్కంలోని ఫాతిమా కాన్వెంట్‌లో చాందినిక 12వ తరగతి వరకు చదివింది. బాల్యం నుంచి చదువుపై శ్రద్ధ కలిగిన చాందినిక చదువులో ఎప్పుడూ ముందే ఉండేది. 10, 12 తరగతుల్లో మంచి రాంక్ సాధించింది. మెడ్రాస్ క్రిస్టియన్ కాలేజీ నుండి బీఎస్సీలో పట్టా పొందింది.


గవర్నర్ ఆర్ఎన్ రవి నుంచి పట్టా అందుకుంటున్న చాందినిక

మద్రాసు విశ్వవిద్యాలయంలో మెడికల్-మైక్రో బయాలజీలో మూడేళ్ల ఎంఎస్సీ పూర్తిచేసి, గోల్డ్ మెడల్ అందుకొంది. కోర్సు అయిన ఒక సంవత్సరం తరువాత జరిగిన స్నాతకోత్సవంలో గవర్నర్ రవి ఆమెకు బంగారు పతకాన్ని అందజేశారు. పీజీ చదివే సమయంలోనే కార్డియాలజీకి సంబంధించిన ఇ.సి.ఎం.ఆర్ ప్రాజెక్ట్ చేసింది. దీనికి ఆమె రీసెర్చ్ ఫెలోషిప్ పొందింది. ఇది ఆమె ప్రతిభకు గీటురాయి. రీసెర్చ్‌కి సంబంధించిన అవార్డ్ సర్టిఫికెట్ కూడా అందుకొంది. ప్రస్తుతం చాందినిక రాజీవ్ గాంధీ గవర్నమెంట్ హాస్పిటల్‌లో ఉద్యోగినిగా సేవలందిస్తోంది. ఇంకా చదువులో ముందుకు వెళ్లాలన్నది ఆమె ధ్యేయం. మైక్రోబయాలజీలో రీసెర్చ్ చేయాలన్నది ఆమె అభిమతం. చదువు విషయంలో తన తల్లిదండ్రులు తనకెంతో స్వేచ్ఛనిచ్చారని, వారి ప్రోత్సాహం వల్లేనే తనకు చదువు పట్ల ఆసక్తి, శ్రద్ధ కలిగాయని చాందినిక తెలిపింది.

చాందినికకు సంగీతం అంటే మక్కువ. అభిరుచి ఉండడమే కాకుండా ఏడేళ్ల పాటు శాస్త్రీయ సంగీతంలో శిక్షణ తీసుకుంది. పాఠశాల రోజుల నుంచి ఇప్పటివరకు సంగీతంలో ఎన్నో బహుమతులు అందుకుంది. శ్రీశ్రీ రవిశంకర్ 4,000 మంది సంగీతకారులతో నిర్వహించిన సంగీత కార్యక్రమంలో చాందినిక కూడా పాల్గొనడం విశేషం. చెన్నైలోని ఎన్నో సభల్లో అన్నమాచార్య, త్యాగరాజ కీర్తనలను తోటి కళాకారులతో కలసి ఆలపించింది. గానం చేయడమేగాక రుచికరమైన వంట చేయడం కూడా ఆమె అభిరుచుల్లో ఒకటి. చదువు పట్ల ఆమె ఆసక్తికి అవధులు లేవు. ఆమె శక్తికి ఎదురులేదు, ఆ శక్తే ఆమెను చదువులో ముందుకు నడిపిస్తోంది.


తల్లిదండ్రులతో...

"చదువు ప్రతి ఒక్కరికి అవసరం. చదువుకు ప్రాధాన్యత ఇస్తే జీవితంలో అత్యుత్తమ శిఖరాలను అధిరోహించవచ్చు. అందుకే జీవితంలో చదువు ముఖ్యం. మనిషి ఎదుగుదలకు చదువు ముఖ్య పాత్ర వహిస్తుంది. చదువును ప్రేమిస్తే జీవితం అర్థవంతం, ఫలప్రదం అవుతుంది". అని చాందినిక 'తరుణి'తో తన మనోభావాలను పంచుకొంది.



చెన్నై వేపేరిలో వున్న సెయింట్ క్రిస్టఫర్స్ కాలేజీలో శుక్రవారం 'స్వచ్ఛతా' కార్యక్రమం నిర్వహిస్తున్న ఎన్‌ఎల్‌సీఐఎల్ చెన్నై కార్యాలయ సిబ్బంది, కళాశాల ప్రొఫెసర్లు, విద్యార్థులు, హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ డాక్టర్ టీజీ శ్రీనివాసన్, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ నితిల దేవకారుణ్యం, వైస్ ప్రిన్సిపల్ మరియన్ ఉష, కార్యదర్శి పరిమల పాల్ తదితరులు

మియాట్‌లో అరుదైన చికిత్స


ఉషారాణిని అభినందిస్తున్న మల్లికా మోహన్‌దాస్

చెన్నై, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): దక్షిణ భారతదేశంలోనే మొట్టమొదటిసారిగా మియాట్ ఆస్పత్రి వైద్యనిపుణులు అధునాతన స్టెంటింగ్ టెక్నిక్‌ను ఉపయోగించి, బ్రెయిన్ స్టెమ్ వద్ద ప్రాణాంతకమైన ఆర్ట్ అనూరిజంకు విజయవంతంగా చికిత్స నిర్వహించారు. ఈ చికిత్సకు నేతృత్వం వహించిన న్యూరో రేడియాలజిస్ట్ డాక్టర్ కార్తికేయన్ వాంచిలింగం, ఆస్పత్రి చైర్మన్ మల్లికా మోహన్‌దాస్ శుక్రవారం మీడియాకు చికిత్స వివరాలను వెల్లడించారు. చెన్నైకి చెందిన 69 ఏళ్ల ఉషారాణికి మెదడులోని రక్తనాళాల్లో బలహీన ప్రాంతం పొక్కులా ఉబ్బి రక్తంతో నిండిపోయింది (బ్రెయిన్ అనూరిజం). వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొందినా ఫలితం లేకపోవడంతో చివరికి ప్రాణాపాయ స్థితిలో ఆమె మియాట్‌ను ఆశ్రయించారు. పరీక్షించిన డాక్టర్ కార్తికేయన్ బేసిలర్ ఆర్టరీ అని పిలువబడే మెదడుకు రక్తాన్ని సరఫరా చేసే ధమనిలో అనూరిజం వున్నట్లు నిర్ధారించారు. అనంతరం న్యూరో రేడియాలజిస్టులు దక్షిణ భారతదేశంలోనే మొదటిసారిగా అత్యాధునిక పరికరమైన నెక్‌స్టెంట్ ఉపయోగించి, పిన్‌హోల్ విధానాన్ని విజయవంతంగా పూర్తి చేశారు. ఉషారాణి నాలుగు రోజుల్లోనే కోలుకుని యధావిధిగా తమ పనులు చూసుకుంటున్నారని వైద్యులు తెలిపారు. ఈ సందర్భంగా తన ప్రాణాలను రక్షించిన ఆస్పత్రి వైద్యులకు ఉషారాణి కృతజ్ఞతలు తెలిపారు.

రేలా ఆధ్వర్యంలో వాకథాన్



వాకథాన్‌ను జెండా ఊపి ప్రారంభిస్తున్న తాంబరం డీసీపీ పవన్‌కుమార్ రెడ్డి, డాక్టర్ ఇలన్‌కుమరన్ కళియమూర్తి

చెన్నై, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ ఊపిరితిత్తుల దినం, ప్రపంచ హృదయ దినం సందర్భంగా క్రోంపేటలోని రేలా హాస్పిటల్ ఆధ్వర్యంలో శుక్రవారం వాకథాన్ నిర్వహించారు. ఈ వాకథాన్‌ను తాంబరం డీసీపీ పవన్‌కుమార్‌రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్ సీఈఓ డాక్టర్ ఇలన్‌కుమరన్ కళియమూర్తి, డాక్టర్ శ్రీనాథ్ విజయశేఖరన్, డాక్టర్ ఐశ్వర్యారాజ్‌కుమార్ తదితరులు హాజరయ్యారు. ఈ వాకథాన్‌లో సుమారు 500 మంది పాల్గొన్నారు. ఇదిలా ఉండగా ప్రపంచ హృదయదినం సందర్భంగా ఈ నెల 29న ఉచిత ఊపిరితిత్తులు, గుండె సంబంధిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఆస్పత్రి నిర్వాహకులు తెలిపారు. ఈ శిబిరంలో పరీక్షలు చేసుకోదలచినవారు 8610682479 అనే నెంబర్‌కు ఫోన్ పేర్లను నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు.

ఘనంగా జాషువా జయంతి



కార్యక్రమంలో తెలుగు ప్రముఖులు

చెన్నై, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): నవయుగ కవిచక్రవర్తి, కవికోకిల గుర్రం జాషువా 130వ జయంతి శుక్రవారం మద్రాస్ విశ్వవిద్యాలయం తెలుగుశాఖ ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. సాహితీవేత్తల జయంత్యుత్సవాల సందర్భంగా జరిగిన ఈ వేడుకకు తెలుగుశాఖాధిపతి ఆచార్య విస్తాలి శంకరరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జాషువా సమాజంలోని హెచ్చుతగ్గులను వెతికి దానికి గల కారణాలను పరిశీలించి, సమాజంలోని అన్యాయాలను ఎలుగెత్తి చాటడం కోసం వారి కలం నుంచి అనేక కవిత్వ బాణాలను సంధించారన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జలదంకి కోదండ రామిరెడ్డి జాషువా సాహిత్య సారాన్ని, వారి రచనలోని పద్యాలను అద్భుతంగా గానం చేశారు. విశిష్ట అతిథి డాక్టర్ నిర్మలా పళనివేలు.. తన ప్రసంగంలో జాషువా ఆలోచనలు, ఆరాటం, తపన అంతా సమాజ మార్పు కోసమే.. జాషువా కలాన్ని గళంగా మార్చి విశేష సాహిత్య సంపదను సృష్టించారని కొనియాడారు. ఆత్మీయ అతిథి బిట్రా గజగౌరి మాట్లాడుతూ.. జాషువా జయంతి ఏర్పాటు చేసిన తెలుగుశాఖ అధ్యక్షుల ఆలోచన అభినందనీయమని, మహాకవులు సూచించిన మార్గాలు సామాజాన్ని పురోగమనం వైపు పయనింపజేస్తాయన్నారు. మద్రాస్ క్రైస్తవ కళాశాల ఆచార్యులు డాక్టర్ శ్రీపురం యజ్ఞశేఖర్ మాట్లాడుతూ.. తన రచనలో సహనం, సమానత్వం ప్రస్తుత సమాజంలో కనిపించే ధోరణులు ఆనాడే జాషువా తెలియజేశారని, ముఖ్యంగా సమాజంలోని అసమానతలపై కలం ఝళిపించిన విశ్వనరుడు జాషువా అని పేర్కొన్నారు. రాజీవ్‌గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం తెలుగుశాఖాధ్యక్షులు డాక్టర్ జడా సుబ్బారావు మాట్లాడుతూ.. జాషువా రచనలు సమాజాన్ని ప్రతిబింబించేలా ఉంటాయని, జాషువాని ఒక కులానికి, ఒక మతానికి అంటకట్టకూడదని, కవులకు సమాజ శ్రేయస్సే కాని ఇవి ప్రమాణాలు కావని, అలాగే జాషువా తన సాహిత్యం ద్వారా సమాజంలో అణగారిన వారి సమస్యలను ఎండగట్టారన్నారు. జనని ప్రధాన కార్యదర్శి గుడిమెట్ల చెన్నయ్య స్వాగతం పలికిన ఈ కార్యక్రమం.. డాక్టర్ పాండురంగ కాళియప్ప వందన సమర్పణతో ముగిసింది. ఈ కార్యక్రమంలో వేద విజ్ఞాన వేదిక అధ్యక్షులు జేకే రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రక్తమూల కణాల దానంపై అవగాహన కల్పించాలి

● డాక్టర్ అరుణా రాజేంద్రన్

చెన్నై, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఫాంకొని అనీమియా అనే మజ్జ పనిచేయని రోగులకు రక్తమూలకణాలను దానం చేయడం ద్వారా వారికి కొత్త జీవితాలు వస్తాయనే విషయంపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని మద్రాస్ మెడికల్ కాలేజీ చిన్నారుల వైద్యవిభాగం హెమటాలజీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ అరుణా రాజేంద్రన్ అన్నారు. నగరంలో శుక్రవారం ఉదయం జరిగిన మీడియా సమావేశంలో బ్లడ్ క్యాన్సర్ రోగులకు సేవలందించే డీకేఎమ్మెస్ బీఎమ్మెస్టీ జర్మనీ స్వచ్ఛంద సంస్థ ద్వారా బెంగళూరుకు క్లినికల్ ఫార్మసిస్ట్ డాక్టర్ స్మితాజోషి రక్తమూలకణాన్ని దానం చేసి తిరుచ్చికి చెందిన సెల్వా అనే బాలుడి కొత్త జీవితాన్ని ప్రసాదించిన సంఘటన వివరించారు. ఈ సమావేశంలో డాక్టర్ స్మితాజోషి, బాలుడు సెల్వా, అతడి తల్లిదండ్రులు కూడా పాల్గొన్నారు. డీకేఎమ్మెస్ బీఎమ్మెస్టీ ఫౌండేషన్ ఇండియా సీఈఓ పాట్రిక్ పాల్ మాట్లాడుతూ జర్మనీలో రక్తమూలకణాలను దానం చేయడానికి పది లక్షలమందికి పైగా తమ సంస్థలో పేర్లను నమోదు చేసుకున్నారని, భారతదేశంలో సుమారు లక్షమంది తమ సంస్థలో పేర్లు నమోదు చేసుకున్నట్టు తెలిపారు. డాక్టర్ స్మితా జోషి మాట్లాడుతూ రక్తమూలకణం దానం చేయడానికి పేరును నమోదు చేసుకున్న స్వల్పకాలంలోనే ఓ బాలుడికి తన బ్లడ్ స్టెమ్‌సెల్ అన్ని విధాల సరిపోతుందని కబురు రావటం తనకెంతో ఆనందాన్ని కలిగించిందన్నారు. తన స్టెమ్ సెల్ ద్వారా కోలుకున్న సెల్వా రెండు రోజుల ముందే కలుసుకోవడం సంతోషాన్నిచ్చిందన్నారు. డాక్టర్ అరుణా రాజేంద్రన్ మాట్లాడుతూ ఇప్పటివరకూ తాము 116 మజ్జమార్పిడి చికిత్సలు విజయవంతంగా నిర్వహించినట్లు తెలిపారు. రక్తమూలకణాలను అమర్చేందుకు అయ్యే శస్త్రచికిత్సలకు సంబంధించి 50 శాతం ఖర్చులను డీకేఎమ్మెస్ బీఎమ్మెస్టీ సంస్థ భరించటం వల్లే మరిన్ని శస్త్రచికిత్సలను చేయగలుగుతున్నామని తెలిపారు.



బ్లడ్‌స్టెమ్‌సెల్ దాత స్మితాజోషి, చికిత్స పొందిన సెల్వాతో డాక్టర్ అరుణా రాజేంద్రన్ డీకేఎమ్మెస్ బీఎమ్మెస్టీ ఫౌండేషన్ సీఈఓ పాట్రిక్ పాల్


నూతన కార్యాలయంలో సంస్థ సిబ్బంది

'ఫండ్స్ ఇండియా' అడ్రసు మార్పు

చెన్నై, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): దేశంలోని ప్రముఖ డిజిటల్ వెల్త్ మేనేజ్‌మెంట్ ప్లాట్‌ఫారాల్లో ఒక్కటైన ఫండ్స్ ఇండియా మకాం మార్చింది. నుంగంబాక్కంలోని కొత్త కార్యాలయానికి మారింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సంస్థ సీఈవో గిరిరాజన్ మురుగన్ మాట్లాడుతూ.. ఈ మార్పు తమ సంస్థ పరిణామాన్ని సూచిస్తోందని, తమ క్లయింట్లు, పెట్టుబడిదారులు, ఉద్యోగులకు మరిన్ని సేవలందించాలన్న ఉద్దేశంతో పని చేస్తున్నట్లు వివరించారు. తమ సాంకేతికతను మెరుగుపరచడానికి, డిజిటల్ యుగం కోసం సంపద నిర్వహణ పునర్నిర్వహించడానికి సిద్ధంగా వున్నామని పేర్కొన్నారు.